భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

● హాజరైన జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



ధర్మారెడ్డిపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 13 : మండలంలోని ధర్మారెడ్డిపల్లిలో సీతారామచంద్ర సహిత అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి నూతన దేవాలయంలో శనివారం విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. విఘ్నేశ్వర, నంది, శ్రీరామచంద్రుడు, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయ, నవగ్రహ, ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠానలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామచంద్ర స్వామి కల్యాణం వైభంగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీ శైలంగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, నాయకులు మోహన్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రాజు, వెంకటేశ్, శివ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గోలి సంతోష్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గోలి సంతోష్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గోలి సంతోష్ రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలుచేయలేక ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఉద్యమ నాయకుడు గుంటిపల్లి లక్ష్మీనారాయణ, నాయకులు దేవరకొండ శ్రీనివాస్, రాంపల్లి జంగయ్య, మిట్టు, రాజు, వెంకటేశ్, బోయిన కృష్ణ, కుమార్, నర్సింగ్‌రావు, కట్ట నరేశ్, తూర్పాటి నర్సింహ, రాము, నరేశ్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పని కల్పించాలి

● చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి రాములు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో చేనేత సహకార సంఘాలకు మంజూరు చేసిన రుణాలను రద్దు చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలన్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలువాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేతమిత్ర పథకాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే చేనేత సొసైటీల్లో నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేయాలన్నారు. జియోట్యాగ్ చేసిన ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించాలన్నారు. చేనేత కార్మికుల కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ తెల్లరేషన్ కార్డు, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు సుల్తాన్ పురుషోత్తం, మహేశ్వరం మురళి, గర్దాస్ లింగయ్య, శ్రీరాములు, నర్సింహ, కృష్ణమూర్తి, సత్యనారాయణ, దేవదాసు, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భువనగిరి చిన్నారులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ రివార్డులు అందుకుంటున్న తారక్‌నంద, అకృతి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 13 : భువనగిరి పట్టణంలోని ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్‌కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంపతుల కుమారుడు చావా తారక్‌నంద, కుమార్తె చావా ఆకృతి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. తారక్ నంద కేవలం నిమిషం 42 సెకన్లలోనే 100 దేశాలు, రాజధానుల పేర్లు చెప్పినందుకు గానూ, అలాగే 195 దేశాలు, రాజధానుల పేర్లను 4 నిమిషాల 50 సెకండ్ల వ్యవధిలో చెప్పినందుకు గానూ చావా ఆకృతి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం శనివారం ఢిల్లీలోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా చిన్నారుల తండ్రి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తన కూతురు, కుమారుడు ఈ అవార్డు దక్కించుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నారులు ముమ్ముందు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు తమ వంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీడీఓ

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిరంజన్‌వలీ

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 13 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు, కన్వీనర్లు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ నిరంజన్‌వలీ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు, కన్వీనర్లతో సమీక్షా సమావేశం జరిగింది. చైర్మన్లు, కన్వీనర్లు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పాటుపడాలన్నారు. సమావేశంలో పీఆర్ఏఈ సునీత, ఎంఎన్ఓ స్వామి, ఏపీఎం కిరణ్ పాల్గొన్నారు.

బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 13 : బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన కట్కరి శ్రీకాంత్‌గౌడ్ నియామకమయ్యారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు ఉష్కాగుల గిరి బాబు శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి దేవేందర్, మండలాధ్యక్షుడు రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

క్యూలైన్‌లో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ధర్మదర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 32 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామి, అమ్మవార్ల నిత్యార్చనలు తెల్లవారుజామున ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చనలు నిర్వహించారు. కల్యాణమండపంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం, కల్యాణోత్సవ సేవ, నిత్య తిరుకల్యాణ మహోత్సవం జరిపించారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవ, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. రాత్రి శయనోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారామచంద్ర వసంత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మాధవీధుల్లో పొల్నాటి గోవింద రావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ నృత్య కళాని కేతన్ వారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.47,06,020 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వీరహనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



వీరహనుమాన్ విజయయాత్ర బైక్‌ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 13 : విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న భువనగిరి పట్టణంలో నిర్వహించే వీరహనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో వీరహనుమాన్ విజయయాత్ర బైక్‌ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పోత్నక్ రాఘవేందర్ మాట్లాడుతూ వీరహనుమాన్ ర్యాలీలో యువకులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ వ్యవస్థాపక ప్రముఖ్ తాడం పాండు, వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి చామ రవీందర్, ఉపాధ్యక్షుడు రాఘవుల సాయి, పట్టణాధ్యక్షుడు కేమోజు మల్లికార్జున్, కార్యదర్శి సాల్వేరు వేణు, వల్లబోజు సతీశ్, జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ సందీప్ పాల్గొన్నారు.

మాచన్‌పల్లిలో వైద్య శిబిరం

గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మలరామారం, ఏప్రిల్ 13 : మండలంలోని మాచన్‌పల్లిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మోబైల్ మెడికేర్ యూనిట్‌లో భాగంగా 60ఏండ్లు పైబడిన వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జయశ్రీ, తేజ, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మణ్ దిడ్డి బాలాజీ, ఉపేందర్, స్పందన, రేణుక, లావణ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి మోత్కుపల్లి డుమ్మా

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13 : కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు గైర్హాజరయ్యారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డితోపాటు సీనియర్ నాయకులు హాజరుకాగా మోత్కుపల్లి మాత్రం కనిపించలేదు. కనీసం ఆయన పేరు సభావేదికపై వినపడలేదు. రెండ్రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ మాదిగ వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను సముచిత స్థానం కల్పించలేదని ఆరోపించడాన్ని గమనిస్తే మోత్కుపల్లి కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారా? ఆయన పంతం నెగ్గించుకునేందుకు అలిగారా? అన్న గుసగుస వినిపిస్తున్నది. దళిత నాయకుడైన మోత్కుపల్లికి కాంగ్రెస్ పార్టీ సరైన గౌరవం ఇవ్వడం లేదనే చర్చ సైతం సాగుతున్నది.

దీనిపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును వివరణ కోరగా.. వ్యక్తిగత కారణాలతో సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో స్థానం కల్పించలేదన్నమాట వాస్తవమేనని, కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ మాదిగలకు న్యాయం జరిగేలా పోరాడుతానని తెలిపారు.

పుస్తెలతాళ్లుచోరీ

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్13 : ఇంటి డాబాపై నిద్రిస్తున్న మహిళ మెడలోంచి ఆరు తులాల బంగారు పుస్తెలతాడు అపహరణకు గురైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) గ్రామానికి చెందిన మేకపోతుల నర్మద కుటుంబ సభ్యులతో కలిసి మేడపై నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బిల్డింగ్ పైకి ఎక్కి నర్మద మెడలోని 3 తులాల పుస్తెలతాడు, 3 తులాల నల్లపూసల తాడును అపహరించుకెళ్లారు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నాగరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అనుమానిత వ్యక్తులు గ్రామాలో సంచరిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిని త్వరలోనే పట్టుకొని శిక్షిస్తామన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : ఇంటి బయట కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లిన సంఘటన మండలంలోని వీరవెల్లిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన ఎలుకరాజుల శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడును లాక్కెళ్లాడు. తేరుకున్న మహిళ కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు దొంగ వెంట పడినా ఫలితం లేకపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

భువనగిరి కలెక్టరేట్ : మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి

● జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 13 : పాఠశాలల్లో మౌలిక వస్తువుల కల్పనకు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతుందని, అందులో భాగంగా ఏమైనా సమస్యలు తలెత్తితే చర్యలు చేపట్టి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, మండల విద్యాశాఖ అధికారి నాగవర్ధన్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీబీనగర్ : అమ్మ ఆదర్శ పాఠశాలలపై డీఈఓ నారాయణరెడ్డి ఆధ్వర్యంలోఓ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, నోడల్ ఆఫీసర్, ఏపీఎం, సీసీలు, వీఓలకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

తుర్కపల్లి : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు కృషి చేయాలని ఐఈఈ జిల్లా కో ఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు మంచి వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీ బాయి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోత్కూరు : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ కమిటీలు కృషి చేయాలని ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లు, సంఘబంధం లీడర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ దామోదర్, ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అవసరాలు గుర్తించాలి

బొమ్మలరామారం : రాబోయే విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, అందుకు సంబంధించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు, ,ఉపాధ్యాయులు వసతులను గుర్తించి సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీడీఓ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయులు, ఆదర్శ కమిటీ చైర్మన్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, పీఆర్ఏఈ తులసీకృష్ణ, జీహెచ్ఎంలు వరలక్ష్మి, ఉపేంద్ర, రోజారాణి పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలి

● రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

రామన్నపేట, ఏప్రిల్13 : రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ సూచించారు. శనివారం మండలంలోని జనంపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జరిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కుల ప్రకారం ప్రతి భారతీయుడు చదువుకునే అవకాశం కల్పించారన్నారు. బాలికలు చదువు తప్ప వేరే ఆలోచన లేకుండా తమ భవిష్యత్‌ను నిర్ణయించుకోవాలని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి చందన మాట్లాడుతూ.. చదువుతోపాటు దేశ నాయకుల జీవిత చరిత్ర, కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మజీద్, వైస్ ప్రెసిడెంట్ లింగయ్య, న్యాయవాదులు మామిడి వెంకట్‌రెడ్డి, దంతూరి సత్తయ్య, డేవిడ్, స్వామి, జగతయ్య, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో పతనం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

చౌటుప్పల్, ఏప్రిల్ 13 : మోదీ పదేండ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో పతనమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో 60 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో మోదీ విఫలం చెందినట్లు పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో దోనూరి నర్సిరెడ్డి, ఐతగోని విజయ్‌కుమార్, గంగదేవి సైదులు, ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, దోడ యాదిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ఆలేరురూరల్, ఏప్రిల్13 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా జరిగేటట్లు చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ దీప్తి, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణ కుట్రను తిప్పికొట్టాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

భువనగిరి సిటీ, ఏప్రిల్ 13 : ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలు భువనగిరి శివారులోని వెన్నెల కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడు బుర్రు అనిల్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసిందని ఆరోపించారు. విద్యారంగంలో మతోన్మాద భావాలను ప్రేరేపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో పేద, మధ్యతరగతి, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రను పూర్తిగా వక్రీకరించి విద్యలో రామాయణం, మహాభారతం ఇతిహాసాలు ఉండాలని ప్రేరోపిస్తుందని ఆరోపించారు. భిన్నత్వంలో ఏకత్వం గల దేశాన్ని మతకలహాలతో సృష్టించాలని చూస్తుందని విమర్శించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, పెరిగిన మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి వనం రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శివ, చింతల శివ, లావుడియా రాజు, కాసుల నరేశ్, వేముల నాగరాజు, కుక్కుట్ల శివాని, సిరికొండ భవ్య, జిల్లా కమిటీ సభ్యులు రాజు, రాహుల్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు సలీం, వివిధ మండలాల ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

జలకడువలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

కొండాపురంలో రాములోరి ఉత్సవాలు ప్రారంభం

మోత్కూరు, ఏప్రిల్13 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం–జామ చెట్లబావిలో కొలువైన సీతారాముల స్వామి వారి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామా